సాక్షి
అనకాపల్లి
శనివారం । 3 । మే । 2025



గర్జించిన గిరిజనం

ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, జీవో–3ను పునరుద్ధరించాలని మన్యంలో బంద్ పాటించారు. 8లో

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	33.3/21.5
చోడవరం	35.0/24.0



పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు

డాబాగార్డెన్స్: కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ విశాఖ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.

న్యూస్‌రీల్

పుష్పయాగానికి పూలు తరలింపు



తిరుమల తరలిస్తున్న వివిధ రకాల పుష్పాలతో మహిళా భక్తులు

ఎంవీపీ కాలనీ (విశాఖ): తిరుపతిలోని శ్రీ కొండండరామస్వామి వారి పుష్పయాగం కోసం విశాఖ నుంచి వివిధ రకాల పూలను తరలించారు. కార్తీక దీనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన ఈ పుష్పాలను శుక్రవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శన కోసం ఉంచారు. మహిళా భక్తులు ముందుగా పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి, శాస్త్రోక్తంగా ఈ పూలను తిరుమలకు పంపించారు. కలువలు, తామరలతో పాటు పలు రకాల పూలు ఉన్నాయని ఆధ్యాత్మిక వేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపారు. నగరానికి చెందిన మహిళా భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో ఘనంగా తిరునక్షత్రం పూజలు



అప్పన్న ఉత్సవమూర్తులు, భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యుల 1008వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏటా ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తిరునక్షత్రం పూజలు గత నెల 28న ప్రారంభమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం జయంతి సందర్భంగా ఆలయ బేడామండపంలోని హంసమూలన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తులతో పాటు ఆళ్వారులను వేంజింపజేశారు. అనంతరం షోడశోపచార పూజలు, విశేష హారతులు, పారాయణాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం రామానుజాచార్యుల తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది.

జీవీఎంసీ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు

అల్లిపురం (విశాఖ): అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టిన బిల్డర్‌కు సహకరించిన జీవీఎంసీ సిబ్బందిపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విజిలెన్స్ విభాగం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్దిలపాలెం టౌన్ సర్వే నంబర్ 28, 46/2లో దాడి శ్రీరామకృష్ణ అనే వ్యక్తి అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సహకరించిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సీహెచ్.మధుసూదనరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎ.లక్ష్మణరావు, ప్రస్తుతం జీవీఎంసీ మానిటరింగ్ సెల్‌లో అదనపు డిప్యూటీ కమిషనర్–1గా విధులు నిర్వహిస్తున్న ముగడ రాజులపై ఏపీ సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు క్రమశిక్షణా సంఘం విచారణ జరిపి తగిన చర్యలు చేపడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ఎ ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్ ప్లానింగ్ సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున, వాటిని ప్రత్యేకంగా పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం అందిన 23 వినతుల్లో జోన్–2 నుంచి ఐదు, జోన్–3 నుంచి తొమ్మిది, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి మూడు, జోన్–6 నుంచి నాలుగు, జోన్–8 నుంచి ఒకటి చొప్పున ఉన్నాయని ఆయన వివరించారు. అందిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

సరుగుడు నారు.. ఇవ్వండి సారూ..

సత్వరమే ఉచితంగా ఇవ్వాలి



గత ఐదేళ్లు వన నర్సరీల్లో సరుగుడు మొక్కలు పెంచి, సోషల్ ఫారెస్ట్ అధికారులు రైతులకు ఉచితంగా ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో, మే ప్రారంభంలో వర్షాలు కురవడంతో సరుగుడు నారు నాటేందుకు అనువైన పరిస్థితి నెలకొంది. దీంతో పొలంలో దుక్కులు కూడా నిర్వహించాం. వన నర్సరీల్లో సరుగుడు మొక్కలు **సిద్ధంగా ఉన్నా అధికారులు పంపిణీ చేయడం లేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవంటున్నారు. ఈ ఏడాది నర్సరీల్లో సరుగుడు నారుకు ధర నిర్ణయించనున్నారన్న వార్తల నేపథ్యంలో ఆందోళన నెలకొంది. గతంలో మాదిరిగానే ఉచితంగా సరుగుడు నారు ఇవ్వాలి.**

– దొర్ల పైడంనాయుడు, రైతు, పాడుగుపాలెం



కొత్త అగ్రహారం వన నర్సరీలో సరుగుడు నారు

- చెరకు పంటకు మద్దతు ధర లేకపోవడంతో సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి
- గత ఐదేళ్లు వన నర్సరీల్లో నారు పెంచి రైతులకు ఉచితంగా అందించిన సోషల్ ఫారెస్ట్ శాఖ
- ఈ ఏడాది స్వల్ప ధరకు విక్రయించాలని ఉన్నతాధికారుల యోచన
- వారి అనుమతి కోసం ఎదురు చూస్తున్న సోషల్ ఫారెస్ట్ అధికారులు
- వర్షాలు కురవడంతో నారును సత్వరమే పంపిణీ చేయాలని కోరుతున్న రైతులు



కె.కోటపాడు: సరుగుడు సాగుకు ఈ ఏడాది ఎప్పుడూ లేనంత ఆసక్తి పెరిగింది. చక్కెర కర్మాగారాల్లో అనుకూల పరిస్థితి లేకపోవడం, బెల్లం అమ్మకాలు కూడా మందగించడంతో ఈ ఏడాది రైతులు చెరకు బదులు సరుగుడు వైపు చూస్తున్నారు. సాధారణ పంటల సాగు ఖర్చులు పెరగడంతోపాటు మంచి మద్దతు ధర లభించకపోవడంతో కొంతకాలంగా సరుగుడు సాగుకు ఆదరణ పెరిగింది. పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ లభించడంతో అందరూ ఇటే మొగ్గ చూపిస్తున్నారు. దానికి తోడు చెరకు ఎఫెక్ట్‌తో ఈసారి సరుగుడు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముంది. ముఖ్యంగా కె.కోటపాడు, చీడికాడ, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, రావికమతం తదితర మండలాల్లో చెరకు పంటను సాగు చేసిన పొలాల్లో ఈ ఏడాది సరుగుడును పెంచేందుకు రైతులు ముందుకు వస్తున్నారు.

వన నర్సరీల్లో సిద్ధంగా ఉంది.. కానీ..

జిల్లాలో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో 44 చోట్ల వన నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ వన నర్సరీల్లో సుమారు 33 లక్షల సరుగుడు నారును పెంచుతున్నారు. ఐదారు నెలల కాలం సరుగుడు నారును ఆరోగ్యకరంగా పెంచి రైతులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. నారు ఎదిగిన తరువాత వాటిని ఎర్రమట్టి, ఎరువు వేసిన కవర్లలో ఉంచి ప్రతి రోజూ నీటి తడులను అందించి ఆరోగ్యకరంగా ఎదిగేలా చర్యలను తీసుకుంటున్నారు. ఈ వన నర్సరీల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సన్న, చిన్నకారు రైతులతో పాటు ఉపాధి కూలీలకు ఉచితంగా సరుగుడు నారును అందించారు. ఈ ఏడాది సరుగుడు నారుకు స్వల్ప ధరను వసూలు చేయాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. పైనుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో రైతులు కోరుతున్నా సోషల్ ఫారెస్ట్ అధికారులు వన నర్సరీల్లో పెంచిన సరుగుడు నారును ఇవ్వలేకపోతున్నారు. ధర నిర్ణయించాల్సి ఉంది. వర్షాలు పడి నారు నాటాలని ఆశ పడిన రైతులు దీంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇచ్చిన మాదిరీగానే ఈ ఏడాది కూడా వన నర్సరీల్లో పెంచిన సరుగుడు నారును సత్వరమే ఉచితంగా అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎకరా పొలంలో సరుగుడు సాగు



కొత్త అగ్రహారం గ్రామంలో గల ఎకరా పొలంలో గత ఏడాది సరుగుడు సాగును ప్రారంభించాము. వన నర్సరీలో సోషల్ ఫారెస్ట్ అధికారులు ఉచితంగా మాకు 5 వేల సరుగుడు మొక్కలను ఇచ్చారు. ఈ మొక్కలను నాటిన ఏడాదిలోగానే పంట ఆరోగ్యకరంగా ఎదిగింది. మరో మూడేళ్లలో పంట కోతదశకు చేరుకోనున్నది. పంట **ప్రారంభంలోనే పెట్టుబడి** ఖర్చులు **అయ్యాయి. చెరకు పంటతో పోల్చితే** సరు**గుడుకు పెట్టుబడి చాలా తక్కువ** అవుతుంది. **చెరకు పంటకు సాగు ఖర్చులు పెరిగిపోవడంతోపాటు సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం** సకాలం**లో చెల్లింపులు జరపకపోవడం కారణం**గా సరు**గుడు పంటను వేయాల్సిన పరిస్థితి** నెలకొంది.

– యల్ల రమణమ్మ, సరుగుడు సాగు రైతు, కొత్త అగ్రహారం

ఉన్నతాధికారుల ఆదేశాలతో పంపిణీకి చర్యలు



కలెక్టర్ ఆదేశాల మేరకు వన నర్సరీల్లో గల సరుగుడు మొక్కల పంపిణీని చేపట్టనున్నాం. వర్షాకాలం ప్రారంభమయ్యే జూన్ నెల నుంచి పంపిణీ చేపట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా సరుగుడు పంటకు నర్సరీల్లో ప్రతి రోజూ నీటి తడులను అందిస్తూ, మొక్క ఆరోగ్యకరంగా ఉండేటట్లు సంరక్షిస్తున్నాం.

– జి.లక్ష్మణ్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో

కేజీబీవీ విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందనలు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశంలో ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం మంచి పరిణామమన్నారు. కేజీబీవీ విద్యాలయాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో పదో తరగతి ఫలితాలలో రెండో స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాలలో మొదటిస్థానం సాధించడం అభినందనీయమని, వచ్చే సంవత్సరం కూడా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఎస్ఎస్ఏ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు ఆర్. జయప్రకాష్ జిల్లా ఫలితాలను వివరిస్తూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు సంబంధించి పదో తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించడం జరిగిందని, జిల్లాలో గల 20 పాఠశాలలకు 8 పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత, ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడం జరిగిందన్నారు. 20 కళాశాలలకు 5 పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. 550 పైగా మార్కులు సాధించిన 40 మంది పదో తరగతి విద్యార్థినులను, 950 పైగా మార్కులు సాధించిన ఇంటర్మీడియట్ విద్యార్థినులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సన్మాన కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఏలూరు జిల్లా అగిరిపల్లిలో గల హిల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఒలింపిక్ ఆటల పోటీలలో ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు.

వృద్ధులే మనకు మార్గదర్శకులు



జి.భీమవరంలో వృద్ధాశ్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



రాష్ట్రపతి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షిస్తున్న వయో వృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి, వృద్ధులు, అధికారులు

- వారిని కంటికి రెప్పలా చూసుకుందాం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- జి.భీమవరంలో వర్చువల్‌గా వృద్ధాశ్రమం ప్రారంభం

కశింకోట: గతానికి వర్తమానానికి వృద్ధులు వారధి లాంటి వారని, భవిష్యత్‌కు మార్గదర్శకులని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. కశింకోట మండలంలోని జి.భీమవరం గ్రామంలో పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీకాప్డ్ అండ్ స్పాస్టిక్స్ నిర్వహించనున్న వృద్ధాశ్రమంతోపాటు వివిధ రాష్ట్రాల్లోని ఐదు ఆశ్రమాలను శుక్రవారం రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమం పురస్కరించుకొని రాష్ట్రపతి మీట నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రత్యక్షంగా వృద్ధులు, అధికారులు, స్థానికులు వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన దేశ సంస్కృతిలో భాగమన్నారు. నేటి పోటీతత్వం, వేగవంతమైన జీవితంలో సీనియర్ సిటిజన్ల మద్దతు, ప్రేరణ, మార్గదర్శకత్వం యువతరానికి అతి ముఖ్యమైనవన్నారు. సీనియర్ సిటిజన్లకు ఉన్న అనుభవాలు, జ్ఞానం యువతరానికి సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కోవడానికి సహాయపడతాయన్నారు. మన వృద్ధులు గౌరవంగా, చురుగ్గా జీవించేలా చూసుకోవడం మన సమష్టి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ఢిల్లీలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ పోర్టల్ ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం ప్రతిజ్ఞ చేయించారు.

ఈ ఏడాది 15 వృద్ధాశ్రమాలు

ప్రారంభోత్సవం అనంతరం ఇక్కడ జరిగిన సమావేశంలో వయో వృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ పదేళ్ల తర్వాత మొదటి సారిగా రాష్ట్రానికి ఈ ఏడాది 15 వృద్ధాశ్రమాలు మంజూరయ్యాయన్నారు. గత నెల రోజుల వ్యవధిలో లక్ష సీనియర్ సిటిజన్ కార్డులను పంపిణీ చేశామన్నారు. అవసరమైన వారు గ్రామ, వార్డు సచివాలయాల్లోగాని, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాల్లోగాని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్డు వల్ల ఐదు లక్షల రూపాయల వైద్య బీమా సదుపాయం కలుగుతుందన్నారు. ఇక్కడి వృద్ధాశ్రమాన్ని రెండేళ్ల పాటు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తర్వాత సవ్యంగా పనిచేస్తే కొనసాగిస్తామన్నారు. రెండేళ్లు జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు. వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుడు ఎ.రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు బి.అశయ్య, పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీకాప్డ్ అండ్ స్పాస్టిక్స్ నిర్వాహకురాలు డి.రజని, కార్యదర్శి ఎం.సత్యవాణి, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటలక్ష్మి, హెచ్‌డీటీ భాస్కరరావు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

జీవీఎంసీ నిర్వాకం.. అనధికార కట్టడం

- ప్లాన్ అప్రూవల్ లేకుండా బంగ్లా కట్టేశారు..
- వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లోని 22 సెంట్ల పార్కు స్థలంలో నిర్మాణం
- ఆర్‌టీఐ దరఖాస్తుతో బట్టబయలైన ఉల్లంఘన



అనుమతి లేకుండా నిర్మించిన బంగ్లా



భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయలేదని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం సామాజిక కార్యకర్తకు ఇచ్చిన సమాధానం

సాక్షి, అనకాపల్లి: సామాన్యులకైతే ఒక న్యాయం.. జీవీఎంసీకైతే మరో న్యాయమా? అనుమతులు లేకుండా ఎవరైనా ఇల్లు నిర్మిస్తే అక్రమ నిర్మాణమంటూ స్వయానా జీవీఎంసీ అధికారులే కూల్చేస్తారు. మరి వారే ప్లాన్ అప్రూవల్ లేకుండా భవనం నిర్మిస్తే.. ఎవరికి చెప్పుకోవాలి? ఎవరిపై చర్యలు తీసుకోవాలి? జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని సుంకరమెట్ట జంక్షన్‌కు సమీపంలో ఎస్‌బీఐ కాలనీ లేఅవుట్‌లో జాయింట్ కలెక్టర్ నివాసముంటున్న బంగ్లా ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లో పార్కు కోసమని 1983లో 22 సెంట్ల స్థలం కేటాయించారు. 40 ఏళ్లుగా ఉన్న ఆ స్థలంలో సుమారు రూ.1.2 కోట్లతో ఎటువంటి ప్లాన్ అప్రూవల్ లేకుండా జీవీఎంసీ ఒక బంగ్లా నిర్మించింది. అది అనకాపల్లి వచ్చినప్పుడు జీవీఎంసీ కమిషనర్ విశ్రాంతి తీసుకోవడానికి కట్టామని, ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌కు కేటాయించినట్లు జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. అందులో ఇటీవలే జేసీ జాహ్నవి గృహప్రవేశం కూడా చేశారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు స్థలంలో శాశ్వత నిర్మాణం ఎలా చేపట్టారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని నిర్మాణ సమయంలో సామాజిక కార్యకర్త కాండ్రేగుల వెంకటరమణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదు. దీంతో ఆయన ఆర్‌టీఐను ఆశ్రయించగా ఈ బంగ్లా నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ లేదని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం బదులిచ్చింది. ఈ బంగ్లా స్థలంలో యథావిధిగా పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని, అలా కాకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటూ సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.

విజయదశమికి నూకాంబిక నూతన ఆలయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ శోభారాణి

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణం పనులు పూర్తవుతున్నాయని, ఈ ఏడాది విజయదశమి రోజున ప్రారంభించనున్నామని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శోభారాణి చెప్పారు. స్థానిక గవరపాలెం ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమ్మవారి కొత్త అమావాస్య నెల రోజుల జాతర అందరి సహకారంతో విజయవంతమైందన్నారు. నెలరోజుల పాటు సుమారు నాలుగు లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆమె చెప్పారు. మే మాసంలో ఆదివారాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల రోజుల్లో సుమారు రూ.కోటి 16 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు) మాట్లాడారు. ఆలయ ధర్మకర్తలు మజ్జి శ్రీనివాసరావు, సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, ఎర్రవరపు లక్ష్మి, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహంలో హడావుడి / 8లో

వడ్డాదిలో పశు వైద్యాధికారి కోసం నిరీక్షణ

- సకాలంలో మూగ జీవాలకు అందని వైద్య సేవలు
- ఉదయం 11.40 గంటలకు వచ్చిన వైద్యాధికారిపై రైతుల ఆగ్రహం



వడ్డాది పశువుల ఆస్పత్రి వద్ద వైద్యాధికారి కోసం నిరీక్షిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది పశువుల ఆస్పత్రి వైద్యాధికారి కోసం పాడి రైతులు శుక్రవారం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. వడ్డాదికి చెందిన గుమ్మిడి ప్రసాద్‌కు చెందిన గొర్రెపోతును శుక్రవారం ఉదయం కుక్కలు కరిచాయి. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న గొర్రెను వైద్య సేవల కోసం స్థానిక ప్రభుత్వ పశువుల ఆస్పత్రికి ఉదయం 9 గంటలకు తీసుకొచ్చారు. అప్పటికీ పశు వైద్యాధికారి విధులకు హాజరు కాలేదు. ఈలోగా పలువురు రైతులు తమ పశువులు, కుక్కలు, కోళ్లు, ఇతర మూగ జీవాలను వైద్య సేవల కోసం తీసుకొచ్చి నిరీక్షించారు. ఎట్టకేలకు ఉదయం 11.40 గంటలకు పశు వైద్యాధికారిణి విధులకు హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు నిరీక్షించిన రైతులు ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా తరచూ విధులకు ఆలస్యంగా రావడంపై రైతులు గుమ్మిడి ప్రసాద్, గొంతిన లక్ష్మీనారాయణ, బొబ్బరి ఈశ్వరరావు తదితరులు మండిపడ్డారు. రోజూ విధులకు ఆలస్యంగా వస్తే మూగ జీవాలకు ఎలా వైద్య సేవలు అందుతాయని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని రైతులు హెచ్చరించారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో ఆలస్యమైందని వైద్యాధికారి చెప్పినా రైతులు శాంతించలేదు.

క్లుప్తంగా

నూకాంబిక సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



నూకాంబికను దర్శించుకుంటున్న రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవర పాలెం నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్య కుమారి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి జాతరను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శోభారాణి ప్రిన్సిపల్ సెక్రటరీని శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను(గొల్లబాబు), ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం



పిడుగుపాటుకు కాలిపోయిన విద్యుత్ గృహోపకరణాలు

చోడవరం: పట్టణంలో పిల్లావారి తోట ప్రాంతంలో ఇళ్ల మధ్యలో ఉన్న కొబ్బరి చెట్టుపై గురువారం అర్ధరాత్రి పిడుగు పడింది. కొబ్బరి చెట్టు కాలిపోయింది. పిడుగుపాటుకు సమీపంలో ఉన్న కాండూరి సంతోష్, సబ్బవరపు భారతి, గువ్వల లక్ష్మి, వెదురుపర్తి కామాక్షి ఇళ్లలో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఫ్యాన్లు, గ్రైండర్లు, టీవీలు కాలిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

ఆఈసెట్‌కు 5,948 దరఖాస్తులు

- 5న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపరీక్ష

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (ఏయూఈఈటీ)కి దరఖాస్తు గడువు ఈ నెల 1వ తేదీతో ముగిసింది. 2025–2026 విద్యా సంవత్సరా నికి గాను 5,948 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఏయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య నాయుడు శుక్రవారం తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో అందుబాటులో ఉన్న 690 సీట్లకు ఈ దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో ఈ నెల 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. విశాఖ నగరంలో 7 కేంద్రాలతో పాటు తిరుపతి, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

గర్జించిన గిరిజనం

- జీవో నంబరు 3 పునరుద్ధరించాల్సిందే
- ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలుచేయాలి
- కూటమి ప్రభుత్వం స్పందించక పోవడంపై నిరసన
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన వైఎస్సార్‌సీపీ



పాడేరు ఐటీడీఏ ఎదుట రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు



అరకులోయలో నిర్మానుష్యంగా ప్రధాన రోడ్డు

సాక్షి,పాడేరు: గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాల కల్పనకు జీవో నంబరు 3 పునరుద్ధరించాలని, గిరిజన ప్రత్యేక డీఎస్సీ తక్షణమే ప్రకటించాలని గిరిజన డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వీటిపై ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని లేకుంటే గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర గిరిజన ప్రాంతాల నిరవధిక బంద్‌లో హెచ్చరించాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు, అరకు నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చాయి. పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెల్లవారు ఐదు గంటలకే బంద్‌లో పాల్గొన్నారు. పాడేరు డిపో నుంచి బస్సులు నడపకుండా అడ్డుకున్నారు. పాడేరు ఘాట్‌రోడ్డు, జి.మాడుగుల రోడ్డుపై బైఠాయించారు.అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో బైఠాయించారు. గిరిజన ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

స్తంభించిన రవాణా

గిరిజన ప్రాంతాల్లో నిరవధిక్ బంద్‌తో ఏజెన్సీ వ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించింది. గిరిజన డీఎస్సీ సాధన కమిటీ, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ నేతలు ఏజెన్సీ వ్యాప్తంగా ఎక్కడికక్కడ బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పాడేరు డివిజన్ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. గమ్యస్థానాలకు చేరుకునేందుకు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సాయంత్రం వరకు నిరీక్షించారు. పాడేరులోని అన్ని దుకాణాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. పాడేరు, అరకులో వారపు సంతలు జరగలేదు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,ఆదివాసీ ప్రజా సంఘాల నేతలంతా ఐటీడీఏ ఎదుట రోడ్డుపైనే మధ్యాహ్నం భోజనం చేసి నిరసన తెలిపారు.

హామీలను చంద్రబాబు నెరవేర్చాల్సిందే:

సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నూరుశాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు ఆదివాసీలకు కల్పించే విధంగా గిరిజన డీఎస్సీని వెంటనే ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. నిరవధిక బంద్‌లో పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: గిరిజన సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ తదితర సంఘాల పిలుపు మేరకు చేపట్టిన బంద్ అరకులోయలో విజయవంతం అయింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేసి మద్దతు ప్రకటించారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, పెట్రోల్ బంక్‌లు, పర్యాటకశాఖ హోటళ్లు మూతబడ్డాయి. మైదాన ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలు నిలిచిపోయాయి. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు బంద్‌లో పాల్గొని మద్దతు ప్రకటించారు.

మెగా డీఎస్సీలో తీవ్ర అన్యాయం

గిరిజన సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజన నిరుద్యోగులు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, అల్లూరి జిల్లా ప్రధానకార్యదర్శి శెట్టి అప్పాలు, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, నాయకులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. రంపచోడవరంలో హోటళ్లు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ప్రైవేట్ వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని సర్వీసులను మాత్రం ఆర్టీసీ నడిపింది.

చింతూరు: ఆదివాసీ సంఘాల నాయకులు ఉదయం నుంచి స్థానిక మెయిన్‌రోడ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి పలు వాహనాలు నిలిచిపోయాయి.

నేడు బంద్ కొనసాగింపు

గిరిజన ప్రత్యేక డీఎస్సీ డిమాండ్‌తో చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త గిరిజన ప్రాంతాల నిరవధిక బంద్‌ను శనివారం కూడా కొనసాగిస్తున్నామని డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు పి.అప్పలనర్స, వంతాల నాగేశ్వరరావు, ఎస్.మాణిక్యం, కిల్లో సురేంద్ర, కూడా రాధాకృష్ణ, కె.చిన్ని, కెజియారాణి తదితరులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించాలని వారు కోరారు.



పాడేరు డిపోలో నిలిచిన బస్సు సర్వీసులు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో బైఠాయించిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, భాగ్యలక్ష్మి, నేతలు



అరకులోయలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- మరొకరు పరారీ
- రూ.2.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న కారు, గంజాయితో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, గొలుగొండ, నర్సీపట్నం ఎస్సైలు రామారావు, రాజారావు, సిబ్బంది గొలుగొండ మండలం పాలకలపాడు గ్రామ శివారులో మాటు వేశారు. మారుతి ఎర్టిగా కారులో గంజాయి తీసుకొస్తుండగా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోలీసులను గమనించిన స్మగ్లర్లు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వెంటపడి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా ఒకరు పరారయ్యారు. జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ దబ్బకోట గ్రామానికి కర్రి అప్పన్న(27), కర్రి రాజు(36), కర్రి దార(21)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కారు డోర్ అరలో అర కిలో, కిలో చొప్పున 50 కిలోల గంజాయి ప్యాకెట్లను అమర్చి రవాణా చేస్తున్నారు. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. దీని విలువ రూ.2.5 లక్షలుగా అంచనా వేశారు. ఒడిశాలోని జనపాయ గ్రామం వద్ద గంజాయి కొనుగోలు చేసి తుని తరలిస్తుండగా పట్టుబడ్డారు. కిలో రూ.5 వేలకు కొని ఇతర రాష్ట్రాల్లో రూ.25 వేలకు అమ్ముతున్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని పట్టుకునేందుకు రిస్క్ చేసిన సిబ్బంది చిన్నారావు, బాబ్జి, త్రిమూర్తులు, సాయి, సురేష్‌లను అభినందించి, నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

అన్నదాన సత్రం కూల్చివేతను అడ్డుకున్న భక్తులు



అన్నదాన సత్రం వద్ద ఆర్‌అండ్‌బీ జేఈ, ఎస్‌ఐ తదితరులు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత అన్నదాన సత్రం కూల్చి వేయడానికి పొక్లెయిన్‌తో వచ్చిన అధికారులను ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు, భక్తులు శుక్రవారం అడ్డుకున్నారు. ఇక్కడ దాతల సహకారంతో ఫిబ్రవరిలో నూతన అన్నదాన భవనాన్ని నిర్మించారు. ఈ భవనం ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించారని స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు మార్చిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ సూచనలతో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి నవీన్‌దొర ఆలయ కమిటీ చైర్మన్‌కు నోటీసులు జారీ చేశారు. గత నెల 29వ తేదీలోపు ఆక్రమణలు తొలగించాలని నోటీసులో పేర్కొన్నారు. దీంతో ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, ఎస్‌ఐ జి.నారాయణరావు, వారి సిబ్బందితోపాటు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి, ఇతర సిబ్బంది పొక్లెయిన్‌తో వచ్చి ఆక్రమణలు తొలగించడానికి సిద్ధమయ్యారు. దీంతో అమ్మతల్లినాయుడు, భక్తులు ఆక్రమణలను తొలగించవద్దని అడ్డుకున్నారు. రోజూ ఎంతో మందికి అన్నదానం చేస్తున్నామని, అటువంటి దాన్ని తొలగించడం అన్యాయమని వాపోయారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రామకొండలరావు ఇల్లు ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించారని, తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.41.50 లక్షల విలువ వాహనాలు, నగలు, వెండి, నగదు స్వాధీనం
- 25 కేసుల్లో నిందితులుగా గుర్తింపు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్

బిక్కవోలు: అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, నగలు, వస్తువు స్వాధీనం చేసుకున్నట్టు ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.భవ్యకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడారు. ఈ ఏడాది అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డి, చినరాచపల్లి గ్రామానికి చెందిన కచ్చల చిరంజీవి, జంగాలపల్లి గ్రామానికి చెందిన సకిలేటి సాయి, గిడుతూరు గ్రామానికి చెందిన వళ్ల శ్రీను జనవరి 9 తేదీన బిక్కవోలు మండలం బలభద్రపురంలో మూడు చోట్ల చోరీ యత్నం చేశారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలించిన బ్రీజా కారుపై వీరు బలభద్రపురం వచ్చారు. వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్ల చోరీతో పాటు ఏటీఎంలో దొంగతనం, నగల షాపులో చోరీ ప్రయత్నం చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల సాయంతో నలుగురు ముద్దాయిల్లో ఒకరు అయిన సాయిని గుర్తించారు. అతనిని మార్చి 3వ తేదీన తుని రైల్వేస్టేషన్ వద్ద బిక్కవోలు పోలీసులు అరెస్టు చేశారు. కొయ్యలగూడెంలో దొంగలించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని అతనిని రిమాండ్‌కు పంపించారు. కచ్చల చిరంజీవి మాకవరపుపాలెం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మిగిలిన ఇద్దరు నిందితులు దల్లి కామిరెడ్డి, వళ్ల శ్రీనును గురువారం సాయంత్రం 4గంటలకు తుని రైల్వే స్టేషన్ వద్ద అనపర్తి సీఐ సుమంత్, ఎస్సై రవిచంద్రకుమార్ తన బృందంతో అరెస్టు చేశారు. వారిపై తూర్పుగోదావరి జిల్లాలో 3, కాకినాడ జిల్లా 11, అనకాపల్లి జిల్లా 7, ఏలూరు జిల్లా 1, శ్రీకాకుళం జిల్లా 2, విశాఖ జిల్లాలో 1 కేసులు ఉన్నాయి. వీరి నుంచి 71 గ్రాముల బంగారు వస్తువులు, 1.02 కిలోల వెండి వస్తువులు, రూ. 9,80,000 నగదుతో పాటు మూడు బైకులు, ఒక కారు, దొంగతనానికి ఉపయోగించిన వాహనాలు, గ్యాస్ కట్టర్‌తో పాటు రూ.41,50,000 విలువగల వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

నేల రాలిన రైతుల ఆశలు

- అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి, జీడి మామిడి
- 100 ఎకరాల్లో పంట నష్టం



నేల రాలిపోయిన కాయలను తోటలో కుప్పలుగా పోసిన రైతులు

చోడవరం: అకాల వర్షాలతో మామిడి, జీడిమామిడి తోటల రైతుల ఆశలు ఆవిరయ్యాయి. రెండ్రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురవడంతో పంట చాలా మేర దెబ్బతింది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో సుమారు 100 ఎకరాల్లో మామిడి, జీడిమామిడి పంటకు ఈదురుగాలులు కారణంగా నష్టం వాటిల్లింది. ఈ ఏడాది మొదట్లో పూత బాగా వచ్చినప్పటికీ వర్షాలు కురవకపోవడంతో పాటు పొగమంచు కమ్ముకుంది. మంచు వల్ల చాలా మేర పూత రాలిపోయింది. దీంతో ఆలస్యంగా పిందెలు వచ్చాయి. కనీసం ఆ పంటైనా చేతికి వస్తే పెట్టుబడులైనా దక్కుతాయని రైతులు ఆశించారు. ఇప్పుడు పక్వానికి చేరుకుంటున్న సమయంలో ఒక్కసారిగా భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షాలు మామిడి రైతులను నిండా ముంచేశాయి. గురువారం రాత్రి గాలులు వీయడంతో పక్వానికి వచ్చిన మామిడి కాయలు చాలా మేర నేలరాలిపోయాయి. తోటల్లో 20 శాతం పంట నేలరాలిపోయింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తోటలు లీజుకు తీసుకున్న రైతులు, సొంతంగా తోటలు కాపు కాస్తున్న వారు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలు నిండా ముంచేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అతిథి గృహంలో హడావుడి

- నర్సాట్ హౌస్‌లో రెండోరోజు విచారణ
- సింహాచలం విషాద ఘటనపై త్రిసభ్య కమిషన్
- అర్చకుల నుంచి రెవెన్యూ సిబ్బంది వరకూ ప్రతి ఒక్కరినీ విచారించిన కమిషన్
- మృతదేహాలు వెలికి తీసిన వారంతా సంప్రోక్షణ చేసుకోకుండానే విధుల్లోకి రావడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన అర్చకులు
- నేడు ప్రభుత్వానికి నివేదిక అందజేత



విచారణ అనంతరం బయటికి వస్తున్న ఎన్డీఆర్ఎఫ్ ప్రతినిధులు



విచారణ అనంతరం బయటకు వస్తున్న సీపీ బాగ్చీ

సాక్షి, విశాఖపట్నం : ఊహకందని దారుణం.. సింహగిరి చరిత్రలో విషాద పేజీగా నిలిచిపోయిన చందనోత్సవం దుర్ఘటనపై ప్రాథమిక విచారణ పూర్తయింది. తొలిరోజున సింహాచలంపై సాగగా.. మలిరోజున ప్రభుత్వ అతిథి గృహం వద్ద హడావుడి కనిపించింది. అర్చకులు, వేదపండితులతో పాటు రెవెన్యూ, దేవదయ ధర్మాదాయ.. విభిన్న శాఖల అధికారులు, సిబ్బంది విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సుదీర్ఘ విచారణ సాగింది. దుర్ఘటనపై అన్ని విభాగాల నుంచి సమాచారం సేకరించిన త్రిసభ్య కమిషన్ ప్రభుత్వానికి శనివారం నివేదిక సమర్పించనుంది.

సింహాచలంలో ఏటా ఒక రోజు జరిగే పవిత్ర పర్వదినం అప్పన్న నిజరూపదర్శనం.. చందనోత్సవం విషాదోత్సవంగా మారిపోయిన ఘటన నుంచి విశాఖ వాసులు ఇంకా తేరుకోలేకపోతున్నారు. దేవాలయ చరిత్రలో ఇలాంటి దురదృష్టకరమైన ఘటన జరగడం ఇదే తొలిసారి కావడంతో.. భక్తులు ఆందోళన చెందుతున్నారు. మంత్రుల నిర్లక్ష్యంతో ఏడుగురు ప్రాణాలు బలిగొన్న తర్వాత ఉలిక్కి పడిన ప్రభుత్వం.. హడావుడిగా నియమించిన త్రిసభ్య కమిషన్ రెండు రోజుల విచారణ పూర్తి చేసింది. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో.. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు సుదీర్ఘంగా విచారణ చేపట్టి సమగ్ర వివరాలు సేకరించింది. ఆది నుంచీ గోడ కట్టకూడదని చెప్పినా వినిపించుకోకుండా.. కట్టడం వల్లనే విషాదం చోటు చేసుకుందని అర్చకులు వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో.. త్రిసభ్య కమిషన్ దేవస్థాన అర్చకులను కూడా విచారించింది. మాడవీధిని ఆనుకొని రక్షణ గోడ ఉన్నప్పుడు దాని పక్కన కొత్తగా మరో గోడ కట్టడం సరికాదంటూ వైదికులు చెప్పినా పట్టించుకోలేదని కమిషన్‌కు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ఈ మహాపచారం చెయ్యడం వల్లే పెను విషాదం సంభవించిందని కూడా కమిషన్ ముందు తమ స్పందన వెలిబుచ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మృతదేహాల వెలికితీత, శిథిలాల తొలగింపులో పాల్గొన్న సిబ్బందిని పుణ్యస్నానాలు ఆచరింపజేయకుండా, సంప్రోక్షణ చేసుకోనివ్వకుండా.. విధుల్లోకి తిరిగి చేర్చడంపైనా అర్చకులు కమిషన్ ముందు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలా ప్రతి విషయంలోనూ ఆగమశాస్త్ర ఉల్లంఘనలు జరిగాయని కమిషన్‌కు అర్చకులు వెల్లడించారు.

వరదనీటి వ్యవస్థ లేదా..?

సింహాచలంలో వరద నీటిని నియంత్రించేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంపై కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 2018లో రూపొందించిన దేవస్థానం మాస్టర్‌ప్లాన్‌లోనూ ఈ అంశాన్ని పొందుపరచకపోవడంపై దేవస్థానం అధికారులు, వీఎంఆర్‌డీఏ అధికారులపైనా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రెండు మూడు దశాబ్దాలుగా సింహగిరిపై పడుతున్న సగటు వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకొని.. దానికనుగుణంగా నియంత్రించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోకపోవడం సరికాదని సూచించింది. కనీసం వరద నీటి నియంత్రణకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అధికారులు దృష్టి సారించకపోవడంపైనా విస్మయం చెందారు. మాస్టర్‌ప్లాన్‌లో ఉల్లంఘనలు ఉన్నట్లు కూడా ఉన్నాయని గుర్తించిన త్రిసభ్య కమిషన్... ఈ విషయంపై ఎందుకు దృష్టిసారించలేదని ఆయా శాఖల అధికారుల్ని ప్రశ్నించింది. రెండు రోజుల పాటు జరిగిన విచారణలో అన్ని శాఖల నుంచి సమగ్ర వివరాల్ని సేకరించిన కమిషన్.. శనివారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదికను అనుసరించి.. ప్రభుత్వం ఎవరిపై చర్యలు తీసుకోవాలన్నదానిపై నిర్ణయం తీసుకోనుంది. అయితే కేవలం చిన్న స్థాయి అధికారులపైనే ప్రతాపం చూపించి.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మంత్రులపై కనీస చర్యలు ఉండవనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పు మాది కాదంటే.. మాది కాదు

శాఖల వారీగా విచారణ కొనసాగింది. దేవస్థాన అధికారులు, ఇంజినీర్లను తొలుత విచారించారు. గోడ నిర్మాణం, ప్రసాద్ పనుల ఆలస్యం.. మొదలైన విషయాలపై ఆరా తీశారు. అదే సమయంలో టూరిజం ఇంజినీరింగ్ అధికారులను కూడా విచారణకు హాజరవ్వమని ఆదేశించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఇరు విభాగాల్ని ఒకేసారి విచారించిన కమిటీ ముందు.. గోడ నిర్మాణం, పనుల ఆలస్యం మొదలైన అంశాల్లో తప్పు మా శాఖది కాదు.. టూరిజం వాళ్లదేనని దేవస్థానం అధికారులు.. తమది కాదు.. వాళ్లదేనని టూరిజం ఇంజినీర్లు వాదించుకొని.. ఒకరిపై ఒకరు తప్పు నెట్టేసుకునేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. దేవస్థాన ఇంజినీర్లతో పాటు టూరిజం ఇంజినీర్లది కూడా బాధ్యత ఉందని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ జిల్లా అధికారులు కమిషన్‌కు నివేదించినట్లు సమాచారం.

ప్రభుత్వమే అసలు దోషి.!

ఈ ప్రమాదం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యమే తప్పు.. ఇంకోటి లేదన్నది ప్రతి ఒక్కరి నుంచి వినపడుతోంది. భారీస్థాయిలో భక్తులు వస్తారని, ప్రతి చందనోత్సవానికి వర్షం పడుతుందని తెలిసినా.. ఏర్పాట్లు విషయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు మంత్రుల కమిటీ బాధ్యతారాహిత్యం ఏడుగుర్ని పొట్టనపెట్టుకుందనీ.. వారిపైనా చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం డిమాండ్ చేస్తోంది. కేవలం.. అధికారులు, ప్రభుత్వ సిబ్బందిని బలి చెయ్యకుండా.. ఈ ప్రమాదం వెనుక ఉన్న మంత్రులపైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలంటూ ప్రతి ఒక్కరూ డిమాండ్ చేస్తున్నారు.

మేలు చేసిన వర్షాలు





తుమ్మపాల: అకాల వర్షాలు వేసవి దుక్కులకు ఎంతో మేలు చేశాయి. ఏటా జూన్, మే నెలాఖరులో వేసవి దుక్కులు చేసేవారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో ముందుగానే దాదాపు పూర్తయ్యాయి. దాంతో నేల సారవంతంతోపాటు ఖరీఫ్ సాగుకు రైతులు ముందుగానే సిద్ధమవుతున్నారు. మరోవైపు చెరువుల్లో నీరు చేరడం, పొలాల్లో పచ్చిక పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● ప్రణాళికలు సిద్ధం.....

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు దాదాపు 2,500 హెక్టార్ల వరకు ఖరీఫ్ సాగు ప్రణాళికలను రైతు సేవా కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లోను ఖరీఫ్‌లో వరి అధిక విస్తీర్ణంలో సాగు చేయడం పరిపాటి.


పొలాల్లో దాదాపు పూర్తయిన దుక్కులు

ప్రతి రైతు వరి సాగు చేయడం సాంప్రదాయంగా భావిస్తారు. 2,250 హెక్టార్ల వరకు వరి సాగు చేస్తున్నారు. దీని అనంతరం నువ్వులు, మినుములు, వేరుశనగ వేస్తారు. సాధారణ విస్తీర్ణం 2,250 హెక్టార్లు ఉండగా, వర్షాభావ పరిస్థితులను బట్టి సాగు విస్తీర్ణం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండో ప్రధాన పంట చెరకు ఏటా తగ్గుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 128 హెక్టార్లు మాత్రమే సాగు జరుగుతుంది. 122 హెక్టార్ల మేర కూరగాయలతోపాటు చిరుధాన్యాలు పండిస్తున్నారు. గత ఏడాది వర్షాలు ఆలస్యంతో పాటు వరి నార్లు లేక సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. మరి ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలి

ఎండలతో పాటు అకాల వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో పొలాల్లో పూర్తిగా దుక్కులు చేపడుతున్నాం. ఈ దుక్కుల వల్ల ఖరీఫ్ సాగు అనుకూలించి మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం. ప్రభుత్వం కూడా ముందుగానే స్పందించి ఖరీఫ్‌కు రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలి. వర్షాలు అనుకూలిస్తే, సాగును మరింత పెంచి వ్యవసాయాన్ని కొనసాగిస్తాం.

– పచ్చికూర సముద్రాలు, రైతు, రేబాక గ్రామం



పశుగ్రాసం పెరిగింది

ఈ ఏడాది ఎండా కాలంలోనే వర్షాలు మొదలవ్వడంతో పశువులకు పశుగ్రాసం పెరిగింది. దీంతో పశువులకు వేసవి మేత కొరత లేకుండా పోయింది. వేసవి దుక్కులు పొలాల్లో చేపట్టడం వల్ల దమ్ముల నాటికి పొలం సిద్ధంగా తయారవుతుంది. చెరువుల్లో నీరు కూడా చేరడంతో పశువులకు నీటి సమస్య తీరింది. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలు రైతులకు, పాడి రైతులకు అనుకూలంగా మారాయి.

– నాయుడు, రైతు, శంకరం గ్రామం

క్లుప్తంగా

ఇష్టపడి చదివితే ఉన్నత స్థానం


విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్‌ఐ రాములమ్మ

అనకాపల్లి టౌన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పట్టణ మహిళా ఎస్‌ఐ రాములమ్మ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి మెరిట్ సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, పట్నాల కృష్ణమోహన్, మల్లేశ్వరావు, కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ స్థలాన్ని వేలం వేయొద్దని వినతి



ఈవో మురళీకి వినతిపత్రం అందజేస్తున్న జాజుల రమేష్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 83వ వార్డు పరిధిలో వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఖాళీ స్థలాన్ని వేలం వేయడం విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఈవో మురళీకి శుక్రవారం ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్థలం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం వల్ల దేవాలయంలో దైవ కార్యక్రమాలకు తీవ్ర ఆటకం కలుగుతుందన్నారు. దేవాలయ అధికారులకు దీనిపై శ్రద్ధ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఉగ్గిన అప్పారావు, ఇంజరపు వెంకట్రావు, బొండా శంకర్రావు, కొంకి శ్రీరామూర్తి, డొంక సత్తిబాబు, మేడిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

పెందుర్తి: తన దుకాణం వద్ద మద్యం సేవిస్తుండగా పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత తనను కొట్టారని పెందుర్తి మండలం పెదగాడికి చెందిన గళ్ల వెంకటనర్సయ్య అనే వ్యక్తి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తన సెల్‌ఫోన్ లాక్కుని కడుపులో, కన్ను మీద దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా ఈ ఘటనపై సీఐ కేవీ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా.. నలుగురు వ్యక్తులు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తుండగా ఎస్‌ఐ అసిరితాత వారిని పట్టుకున్నారని చెప్పారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో వారిని గట్టిగా మందలించారన్నారు. ఈ కేసుపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 626 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,380	4.740
రెండో రకం	3,750	4,300
మూడోరకం	3,200	3,780

అనకాపల్లి సినిమాలు

రాజా :రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1:అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 :థండర్ బోల్ట్స్
పర్తిసాయి :హిట్-3
షిర్డీసాయి :ఓదెల 2
వెంకటేశ్వర : జింఖానా
శ్రీసత్య :సారంగపాణి జాతకం
రామచంద్ర :తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు , బీ పాజిటివ్-14, ఓ పాజిటివ్-22, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఆటిజంపై అవగాహన


అవగాహన కలిగిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు ఆటిజం అవేర్‌నెస్ డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటిజం అనేది వ్యాధి కాదన్నారు. ఆటిజం అంటే న్యూరో లాజికల్ డెవలప్‌మెంటు డిజార్డర్‌గా తెలిపారు. ఆటిజం రావడానికి జన్యుపరమైన కారణాలు కొన్ని ఉన్నప్పటికీ కచ్చితమైన కారణాలు ఇంత వరకు ఎవరూ కనుగొనలేదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్. రామునాయుడు, భవిత ఉపాధ్యాయులు బి.వి. రమణమ్మ, ఎస్. దీప, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

కశింకోట: ఈదురు గాలులతోపాటు కురిసిన వర్షం వల్ల గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కశింకోటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాత్రి 12 గంటల ప్రాంతంలో గాలులు వీయడం, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీనివల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ తర్వాత సరఫరా పునరుద్ధరించినప్పటికీ లైటింగ్ తప్ప ఫ్యాన్లు తిరగక, ఇళ్లలో నీటి మోటార్లు, మిక్సీలు వగైరా పని చేయక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ముందుగా ప్రకటించిన మేరకు మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మరమ్మతులు చేసి సిబ్బంది పూర్తిస్థాయిలో సరఫరాను మధ్యాహ్నం పునరుద్ధరించారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల నిరసన

అనకాపల్లి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 20 నుంచి సమ్మె చేస్తామని తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) సభ్యులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. అందుకు బాధ్యులైన అరబిందో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులందరూ ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇంక్రిమెంట్లు, పని ఒత్తిడి తదితర డిమాండ్లపై చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న తల్లి బిడ్డ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

5న పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్ ప్రమాణ స్వీకారం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలి
- నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్


మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా గుడివాడ అమర్‌నాథ్ ఈ నెల 5న స్థానిక రింగ్ రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి పాలనపై ఏడాదిలోనే గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు వస్తాయోనని ఎదురు చూస్తున్నారని, మరో సారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా తీసుకునేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు విఫలమయ్యారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమిపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. మరో రెండు సంవత్సరాలు ప్రజలు పక్షాన పోరాటాలు చేసినట్లయితే రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలే మంచి భవిష్యత్‌ను అందిస్తారన్నారు. జగన్ 2.0 కార్యక్రమానికి పార్టీ శ్రేణులు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.


పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

వారం రోజుల్లో గ్రామస్థాయి కమిటీలు..

గ్రామాల్లో వారం రోజుల్లో పార్టీ ఆదేశాలు మేరకు నూతన కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని మలసాల భరత్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచి ఇతర పార్టీల్లోకి జంప్ అయిన వ్యక్తులకు అక్కడ గుర్తింపు లేకుండా పోయిందన్నారు. జిల్లాలో కూటమి నాయకులు త్వరలో వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ కూటమి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైనా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ పాలనలో ఏడాదిలోనే పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, కూటమి పాలనలో కన్నీరే మిగిలిందన్నారు. అమర్‌నాథ్ ప్రయాణ స్వీకారం సందర్భంగా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, అనకాపల్లి, కశింకోట మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కొట్నాల పద్మకుమారి, తగరంపూడి నూకరత్నం, కశింకోట మండల యువజన విభాగం అధ్యక్షుడు నీటిపల్లి దివాకర్, పార్టీ సీనియర్ నేతలు గొల్లవిల్లి శ్రీనివాసరావు, బొడ్డేడ శివ, విల్లూరి చంద్రశేఖర్, కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, కలగ గున్నయ్యనాయుడు, కరక సోమునాయుడు, గైపూర్ రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ధర్నా


డిపో వద్ద ధర్నా చేస్తున్న హైర్ బస్సుల డ్రైవర్లు

అనకాపల్లి: ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఆర్టీసీ కాంట్రాక్ట్ హైర్ బస్సు వర్కర్స్ యూనియన్ డిపో నాయకుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డిపో వద్ద డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు కనీస వేతం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులు జీతాలు పెంచాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు


మహిళను అరెస్టు చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న మహిళను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వై. లక్ష్మీనాయుడు శుక్రవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేయగా, కరక చిలకమ్మ (42) సారా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రెండు లీటర్ల సారా స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. దాడిలో ఎస్ఐ ఎస్.వి. నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

పరవాడ: గాజువాక-యలమంచిలి రహదారిలో రావాడ శివారు ధర్మారాయుడుపేట కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ బాలిక మృతి చెందింది. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలివి.. అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామానికి చెందిన కాకి శ్రీను, భార్య రేవతి, కుమార్తె లిఖిత (7), కుమారుడు దీక్షిత్‌తో కలిసి పెదగంట్యాడలోని బంధువుల ఇంటింకి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ధర్మారాయుడుపేట కూడలి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన కారు వీరి వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. అదే సమయంలో ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో తల్లిదండ్రుల మధ్య వాహనంపై కూర్చున్న లిఖిత రోడ్డుపై తుళ్లిపడింది. దీంతో తలకు తీవ్ర గాయమై, అపస్మారక స్థితికి చేరుకుంది. గాయపడిన బాలికకు పరవాడ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి, అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో బాలిక తల్లిదండ్రులు, తమ్ముడు దీక్షిత్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు.

అదనపు భవనాలకు నిధుల మంజూరు

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామం వద్ద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అదనపు భవనాల నిర్మాణానికి రూ.1.68 కోట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంజూరు చేశారని జనసేన పార్టీ అనకాపల్లి శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిధులతో జూనియర్ కళాశాల నిర్వహణకు 6 తరగతి గదులు, 2 టాయిలెట్ బ్లాకులను నిర్మించనున్నారని, దీనివల్ల వసతి కొరత తీరనుందని పేర్కొంది.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


మృతుడు కృష్ణ

పరవాడ: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి.. మండల పరిధి గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో గుండేపల్లి కృష్ణ (30) తల్లి రమణతో కలసి నివసిస్తున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న కృష్ణకు ఇంకా వివాహం కాలేదు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన కృష్ణ, మళ్లీ మద్యం సేవించేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. తల్లి డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపం చెంది, ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెళ్లి కాలేదన్న కారణంతో మద్యానికి బానిస అయ్యాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కేస్తు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుతో రైవాడ ఆయకట్టుకు ముప్పు


సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: చింతలపూడి, మారిక గ్రామాల మధ్య హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే రైవాడ జలాశయం ఆయకట్టుకు ముప్పు వాటిల్లుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అదానీకి చెందిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుతో రైవాడ ఆయకట్టుతో పాటు విశాఖ నగర వాసుల తాగునీటికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులకు అవసరమైన 213.80 ఎకరాల భూసేకరణకు మారిక గ్రామంలో విజయనగరం జిల్లా కలెక్టర్ గత నెల 23న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వేపాడ మండలంలోని మారికకొండ, అక్కడి గిరిజనుల జీవనాధారమైన భూమిని అదానీకి కట్టబెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని స్థానిక గిరిజనులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. విద్యుత్ డిమాండ్ సమయంలో నీటిని పంప్ చేసి విద్యుదుత్పత్తి జరిగేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారన్నారు. నీటి నిల్వ కోసం దేవరాపల్లి మండలం సమ్మెద గ్రామానికి ఎగువ భాగంలో ఒకటి, దిగువ భాగంలో మరో రిజర్వాయర్ నిర్మించనున్నారని తెలిపారు. శారదానదిపై ఈ రెండు రిజర్వాయర్లు నిర్మిస్తే రైవాడ జలాశయానికి వచ్చే నీరు తగ్గిపోతుందన్నారు. రైవాడ జలాశయం కింద ఉన్న దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, వేపాడ మండలాల్లో 21,344 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. జలాశయం నుండి విశాఖ నగర వాసులకు ప్రతి రోజూ 15 ఎంజీడీ తాగునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైవాడ జలాశయానికి వచ్చే నీటిని హైడ్రో పవర్ ప్లాంట్‌కు మళ్లిస్తే రైవాడ ఆయకట్టు భూములతో పాటు విశాఖ నగర వాసులకు తాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నోటిఫికేషన్ రద్దు చేయకుంటే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆధునిక పద్ధతులతో ఆశాజనకంగా వేరుశనగ దిగుబడి


సీతంపేటలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: ఆధునిక వ్యవసాయ పద్ధతులలో సాగు చేయడం ద్వారా వేరుశనగలో ఆశాజనకంగా దిగుబడి వస్తుందనడానికి సీతంపేట రైతే నిదర్శనమని కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు డా. రాజ్‌కుమార్, డా. సౌజన్య, డా. సత్తిబాబు అన్నారు. నాగయ్యపేట పంచాయితీ శివారు సీతంపేటలో రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు సాగు చేసిన వేరుశనగ పంటను స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి శుక్రవారం వారు క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. గ్రామానికి చెందిన రైతు ఆదిరెడ్డి అచ్చింనాయుడు టిసిజిఎస్-1694 రకం వేరుశనగ పంటను సాగు చేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంట సాగు చేసిన నాటి నుంచి పంట తీసే వరకు ప్రతీ నెలా పంటను పరిశీలిస్తూ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తెగుళ్ల నివారణ చర్యలను, సలహాలు, సూచనలు చేశారు. ఎకరానికి 60 కేజీల విత్తనం నాటగా, 1200 కేజీలకు పైబడి దిగుబడి వచ్చిందని, సాగు ఖర్చు రూ. 23,600 కాగా, రూ. 50వేలుకు పైబడి రాబడి వచ్చినట్టు రైతు అచ్చింనాయుడు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మధురవాడకు చెందిన వేదనభట్ల రామ సత్యనారాయణ దంపతులు శుక్రవారం రూ.లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దాతకు ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.